క్లుప్తంగా

మార్కెట్‌యార్డు పనులు పూర్తిచేయాలి

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత రెండేళ్ల క్రితం ప్రారంభమైన మార్కెట్ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని ఆరోపించారు. దీంతో కూరగాయలు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతీ ఆదివారం సంతలోకి వాహనాలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే వ్యాపారులు అక్కడ అన్ని సదుపాయాలతో వ్యాపారం నిర్వహించుకునే వీలుంటుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు.

ఘనంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాకుంబ ప్రోక్షణ, పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో సుదర్శన హోమం, నిత్యపూర్ణాహుతి, విష్ణుసహస్రనామ పారాయణం, ఉపకుంభ ఆరాధన వంటి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, నాయకులు అంతయ్య, ఒగ్గు కిషోర్, ప్రతాప్‌రెడ్డి, బాల్‌రాజ్, కానుగు భూపాల్, నర్సింహాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షం



అజీజ్‌నగర్‌లో వర్షంలో తడుచుకుంటూ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

మొయినాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ముసురు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో రోజంతా ముసురు వర్షం పడింది. సాయంత్రం సమయంలో ముసురు కాస్త ఎక్కువ కావడంతో ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు, పనులకు వెళ్లి తిరిగి వచ్చే వారు వర్షంలో ఇబ్బందులు పడ్డారు. గొడుగులు లేనివారు తడుచుకుంటూనే వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు వర్షాల కారణంగా రోడ్లు బాగా దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు అవస్థలు పడ్డారు.

విరిగిపడిన మర్రికొమ్మ



మర్రికొమ్మను తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీలోని స్కైలైన్ హోటల్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈదురుగాలులకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మర్రిచెట్టు కొమ్మ విరిగి 33 కేవీ విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. కేతిరెడ్డిపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మొయినాబాద్, అజీజ్‌నగర్ 33 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మంగళవారం విద్యుత్ అధికారులు విరిగిన మర్రికొమ్మను తొలగించారు. విరిగిన స్తంభం స్థానంలో మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు.

స్థలం కేటాయించండి

మంచాల: మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆశ్వల బాలరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తమ సంఘ భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, రమేష్, జగన్, ఎం.వెంకటేష్, సురేష్, నర్సింహ, మహేష్, ముత్యాలు, యాదగిరి, రఘు, రాజు, రంజిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వాన

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- దెబ్బతిన్న పంటలు, రోడ్లు



కొందుర్గు: నిండుకుండలా మారిన మహదేవ్‌పూర్ కమాల్ చెరువు

కొందుర్గు: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. గుర్రంపల్లి, రావిర్యాల, మహదేవ్‌పూర్, పర్వతాపూర్ గ్రామాల్లో చెరువులు నిండి అలుగుపారుతున్నాయి. వర్షాలకు పంటపొలాలు దెబ్బతినడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కొందుర్గు, రేగడిచిల్కమర్రి, ఉమ్మెంత్యాల, తూంపల్లి, వీరన్నపేట తదితర గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న పహిల్వాన్ చెరువు

షాబాద్: గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో షాబాద్ పహిల్వాన్ చందనవెల్లి పెద్ద చెరువులు అలుగులు పారుతున్నాయి. అదేవిధంగా మండల పరిధిలోని మాచన్‌పల్లి, తాళ్లపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. వర్షాలతో వరి, కంది, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

కేశంపేట: కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండల పరిధిలోని పాటిగడ్డ, తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల పరిధిలో వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు తగిన జాగ్రత్తలను తీసుకున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పటేల్ కుంటకు జలకళ

మొయినాబాద్‌రూరల్: కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ సమీపంలో గల పటేల్ కుంటకు నిండుకుండలా మారింది. దీంతో చుట్టు పక్కన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గని ముసురు.. పంటలకు ఎసరు

నందిగామ: వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సోమ, మంగళవారాలలో నిరంతరం ముసురు వదలక పోవడంతో పంట చేనుల్లో చేరిన వర్షం నీరు బయటకు రాలేక పంటలు నీట మునిగిపోయాయి. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తమకు పంటలు చేతికందుతాయో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత వ్యవసాయాధికారులు జాడ లేకుండా పోయారు. నర్సప్పగూడ, వీర్లపల్లి తదితర గ్రామాలో అక్కమ్మ చెరువు బ్యాక్ వాటర్‌తో ఇప్పటికే వరి పంటలు నీట మునిగాయి. ఇంకా ఒక్కటి, రెండు రోజులు అలాగే నీటిలో ఉన్నట్లయితే పంట మురిగిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నందిగామ: చేగూరు శివారులో దెబ్బతిన్న పత్తి పంట



షాబాద్: నిండుకుండలా షాబాద్ పహిల్వాన్ చెరువు



తొమ్మిదిరేకుల గ్రామ శివారులో వాగుపైన ఉన్న చెక్‌డ్యాం నుంచి వెళ్తున్న వర్షపునీరు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో నిండుకుండలా పటేల్ కుంట

ఒక ఫొటో అనేక జ్ఞాపకాలకు ప్రతిరూపం

ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలు

చేవెళ్ల: ఫొటో అనేది అనేక జ్ఞాపకాలకు ప్రతిరూపాలుగా నిలుస్తుందని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.బాలు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆర్‌ఆర్ ఫిలిం స్టూడియో రాజు ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్త లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు రాఘవేందర్, మహేశ్, దేవేందర్, ప్రవీణ్, వెంకటేశ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయని ఫొటోగ్రఫీ జిల్లా అధ్యక్షుడు లింగంగౌడ్, మండల అధ్యక్షుడు కుర్వ మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్త లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు లక్ష్మణ్, శేఖర్, రాము, ప్రభాకర్, ప్రవీణ్, రవి, మల్లేష్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రోడ్డు విస్తరణకు చర్యలు



మెయిన్‌రోడ్డులో కొలతలు వేస్తున్న అధికారులు

షాద్‌నగర్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు వేశారు. రోడ్డు విస్తరణ ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, దానికి కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత స్పష్టం చేశారు.

21న పల్లెపల్లెకు బీజేపీ ప్రారంభం

చేవెళ్ల: బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రవాస యోజన (పల్లె పల్లెకు బీజేపీ) కార్యక్రమాన్ని చేవెళ్ల నుంచి ప్రారంభించేందుకు ఈ నెల 21న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వస్తున్నట్లు మున్సిపల్, మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. చేవెళ్లలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో 21న నిర్వహించబోయే ప్రవాస యోజన కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండల నాయకులు కార్యకర్తలతో కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చేవెళ్ల నుంచి ప్రారంభం అవుతుందని, కావున పట్టణ నాయకులంతా కలిసిమెలిసి తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని మల్కాపూర్ గేట్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు యువ మోర్చా ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలుకుతారన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, జైశంకర్, శర్వలింగం, రవీందర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, సత్యనారాయణ, అశోక్, ఉమాశంకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తిరుపతిరెడ్డి, సందీప్, కృష్ణ, గణేశ్, యోగేశ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రైవేటు వాహనాలపై చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతినా రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ బస్సుల ద్వారా పిల్లలను బడికి తీసుకొస్తున్నారని, వాటికి సరైన పర్మిట్‌లు, ట్యాక్స్ చెల్లింపులు, ఫిట్‌నెస్ సైతం లేవని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే యాజమాన్యాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతుకు దేశవాలీ ఆవు అందజేత



ఆవు వద్ద రైతు వీరేశం

చేవెళ్ల: చేవెళ్లకు చెందిన రైతు వీరేశంకు భూభారతి కమిషన్ సభ్యులు మంగళవారం దేశవాలీ ఆవును అందజేశారు. ఈ సందర్భంగా రైతు వీరేశం చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్, రాజేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలనే భూభారతి కమిటీ సభ్యులు తమసొంత నిధులతో ఆయా మండలాల్లో నిర్వహించిన సదస్సుల్లో తమ వంతుగా ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు గుజరాత్ నుంచి తెప్పించిన దేశవాలీ ఆవును అందించినట్లు రైతు వీరేశం తెలిపారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా

కొత్తూరు: ఆశవర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు ఆశలతో కలిసి పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఆశల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆశలకు బకాయిలు ఉన్న బిల్లులు, అలవెన్సులు వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో రానున్న రోజుల్లో ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు మంజుల, అనిత, చైతన్య, మహేశ్వరి, కవిత, ఇందిరా, నవనీత తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తికి వినతిపత్రం అందజేస్తున్న సాయిబాబా, ఆశలు

పారితోషకాలు చెల్లించాలి

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని ఆశవర్కర్లకు పెండింగ్‌లో ఉన్న పారితోషకాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం శంకర్‌పల్లి సీఐటీయూ ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు పీహెచ్‌సీలో వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ మండల కోశాధికారి స్వప్న మాట్లాడుతూ.. పారితోషకాలు ఆపడంతో ఆశలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని.. అదేవిధంగా ప్రతి నెల 1వ తేదీన పారితోషకాలు వచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో అధికారులు వేగం పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో గల ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన అందరికీ కార్డులు జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 3,105 దరఖాస్తులు వచ్చినట్లు, అందులో 1937 దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయని, 1183 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. 548 దరఖాస్తులు పరిష్కరించినట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ సరిత, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

వ్యవసాయ అధికారులతో సమీక్ష

షాద్‌నగర్: వ్యవసాయ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు సంబంధించి ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారులు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అదేవిధంగా రైతుల కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన యంత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏడీఏ రమాదేవి, ఏఓ నిషాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వార్డు పరిధిలో ఉన్న కాలనీల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం వంటి కనీస సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనునాయక్, భగవాన్‌దాస్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు ఏమి జరుగుతున్నాయి.. ఎలా నిర్వహిస్తున్నారు అని సంబంధిత అధికారి రమ్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో మొక్కలు ప్రజలకు పంపిణీ చేశారా అని ఎంపీడీఓ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్‌హెడ్ సురేఖ

షాబాద్: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ కే.సురేఖ, మేనేజర్ భద్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, చిన్నసోలిపేట్ గ్రామాల్లో మహిళల కోసం జీవనోపాధి నైపుణ్య అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల పాటు వివిధ రకాల నైపుణ్యాలు, మార్కెట్ లింకేజీలు, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ చిట్కాలు వంటి అంశాలను నేర్పించనున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో మహిళలు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఉపాధిని పొందాలని సూచించారు. జిల్లా కో-ఆర్డినేటర్ ఖాసిం, రిసోర్స్ పర్సన్ శైలజ మహిళలకు జీవనోపాధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పవన్‌కుమార్, శ్వేత, హైతాబాద్ వీఓఏ కుమార్ తదితరులు ఉన్నారు.



మహిళలతో వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది

బోనమెత్తిన పల్లెలు

కేశంపేట: శ్రావణమాసం సందర్భంగా మండల పరిధిలోని అల్వాల, కేశంపేట, లేమామిడి, తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో మంగళవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కేశంపేటలో నిర్వహించిన మైసమ్మ బోనాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యెన్నం శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కేశంపేటలో బోనాల ఊరేగింపు



కేశంపేటలో మైసమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్